# నెర్లు

కరువు దెబ్బకి మా ఊర్లో సగం జనం ఊరిడిసినారు.

రాయదుర్గానికీ, కణేకంటికీ, బళ్లారికీ యావన్నా కూలి పనుూ చేసుకోని బతికే దానికి ఎల్లిపోయినారు.

సన్నసన్న రైతుల ఇండ్లల్లో, కూలోల్ల ఇండ్లల్లో ముసలీ ముతక తప్పా ఎవురేగాని లేరు. మాపుపారికాడ తోటల కంచెలకీ, చేన్లల్లో ముండ్ల పొదలకి అల్లుకోనిండే 'పాలవాకు' పీక్కోని వచ్చి, రేతిరికి ఉడకేసుకోని తినేది - ఇండ్ల కాడ ఉండే ముసిలోళ్లు.

నాకు ఏడో తరగతి పరీక్షలు అయిపోతానే బడికి సెలవులిడిసినారు. దాన్నించి, నేను అనంతపురం నించీ అప్పుడే మా ఊరికి పోయినాను.

మా యవ్వ ఒక్కతే మా తోటలో ఉండే ఇంట్లో ఉండేది.

చేన్లన్నీ బోసిపోయి ఎడారి తీరుగా కనిపిస్తా ఉండాయి.

వరుపు పెట్టుకోనిండే దాన్నించీ, మా యవ్వకి పూట గడిచేది కూడా కష్టమయి పోయిండాది. ఇంట్లో ఉండే గాదెలూ, దొంతు కుండలూ అన్నీ వెల్లకిల పడినాయి.

మా ఇంటి ముందర ఉండే వేప, చింత చెట్ల కింద పేడా, కసువు సుబ్బరంగా నూకి ఉండాది. సందకాడ ఆడే మా ఆవుల్ని కట్టేసేది. వేపచెట్టు కిందన కట్టేసిన ఎద్దుల జత తప్పా ఒక్క పసరము కూడా లేదు. అప్పుడే అన్నీ మేతకి దుద్దేకుంట కల్లా మా జీతగాడు తోలుకోని పోయినాడు. ఆ జత ఎద్దుల్నే మా యవ్వ సేద్దేని కని పెట్టుకోని వుండేది. దాన్లల్లో ఒక ఎద్దు నల్లది. దాన్ని కర్రెద్దు అంటాం. ఇంగొకటి ఎర్రది. దాని మొగం మింద తెల్లమచ్చులు ఉండేదాన్నింటి అందురూ దాన్ని 'బొల్లెద్దు' అంటారు.

పెయిటాల అయింది..

ఇంటి ముందరుండే అరుగు మింద కూకోని సంగటీ, ఊరుమిండీ తింటా వుండాను. అల్లంత దవ్వులో ఉండే చింతచెట్టు కిందన మా యవ్వ ఎవురో ఇద్దరు మొగోళ్లని నిలబెట్టే మాట్లాడ్తా వుండాది.

వాళ్లు కొత్తోళ్లే! సద్దూరుపు మనుసులు. నల్లగా వుండారు. తెల్ల అంగీలు వేసుకోని, తెల్ల అడ్డపంచెలు కట్టుకోని ఉండారు. భుజాల మింద మాసిపోయిన తెల్ల టర్కీ టవ్వాళ్ళు వేసుకోనుండారు. చింతచెట్టు కింద కట్టేసి వుండే మా బొల్లెద్దు దిక్కు మాటిమాటికీ జూస్తా వుండారు బొల్లెద్దు పండుకోని నెమ్మదిగా కండ్లు మూసుకుంటా, తెరుసుకుంటా నెమరువేస్తా వుంది.

నేను బిరిబిరీ సంగటి మింగేసి వాళ్ల తావుకి జేరుకుంటి. వాళ్లలో లావు మీసాలాయప్ప బొల్లెద్దు కాడికి పొయ్యి, లెయ్యమన్నట్ల నాలికతో 'లక్‌లక్' మనిపిస్తా. దాని తోకని మెల్లిగా మెలిపెట్టినాడు. అది దడగ్గన లేచి నిలబడింది. చానాసేపు తర్వాత లేచి దాన్నించీనేమో, పెయ్యంతా ఇరుసుకోని ఒక్కసారి నీలిగింది. 'ఓవ్ ఓవ్' మంటూ దాని వీపు మింద మెల్లింగా జవురుతా, ఎద్దుని అంతలక్కా పదేపదే జూస్తా వుండాడు. 'పరకసుడి' లేదు లేమ్మో! అని, మంచి ఎద్దే అన్నెట్లు తృప్తిగా దాని దిక్కు జూస్తానే అన్నేడు.

తర్వాత పేడి మూతి మనిసి, బొల్లెద్దు నోరు తెరచి దాని పండ్లు ఎన్ని ఉండాయో జూసి, అన్నీ సరింగా ఉన్నెట్ల తల ఆడిస్తా ఉండాడు.

ఇదంతా జూస్తా ఉంటే నాకి కొంచెం సేపటికి అర్థమయిపాయె - వాళ్ళిద్దరూ వచ్చిండేది మా బొల్లెద్దుని కొనేదానికేనని. వాళ్ల ఊరు గుంతకంటికి అవతల, అంటే ఈడకి ఎనభై మైళ్ల దవ్వులో ఉందని వాళ్ల మాటల్లో తెలిసె.

నేను మెల్లిగా మా యవ్వ పక్కకి జేరి, చెవిలో గునగున చెప్తి - 'బొల్లెద్దుని అమ్మొద్దు అవ్వా!' అని.

నా మాటలు వింటానే కండ్ల నిండా కోపంతో నన్ని జూసి 'నీకేలరా! పెద్ద సుద్దులు, పిల్లోనివి పిల్లోని తీరుగా ఉండల్ల.. అమ్మొద్దు అంటా ఉండాడు - ఈ మేలు మొగోడు.. సందకాడయితే ఎసిట్లేకి గింజలు లేవు మడి, తే పోరా!.. మీ అబ్బ గంటు యాడన్నా పూడ్చిపెట్టినావో తేపో!' అంటానని గదురుకొనె.

మాయవ్వకి కోపమొచ్చినా, సంతోసమొచ్చినా పట్టేకే వచ్చేది లేదు. మడి, ఆయమ్మ పాతకాలం మనిసి కదా అని నేనే సర్దుకొనేది. బొల్లెద్దు ఆ కొత్తోళ్ళకి నచ్చినాది. మా యవ్వ చేతిలో దుడ్లు పెట్టేసి, వాళ్ళు మా బొల్లెద్దుని పట్టుకోని పోతావుంటే నా కండ్లలో నీళ్లు తిరిగె.

కర్రెద్దు ఎప్పుడు పుట్టిందో నాకి గుర్తు లేదుగానీ, బొల్లెద్దు పుట్టుక మాత్రం నాకింకా గుర్తే...

మేము అప్పుటికింకా ఊర్లోనే కాపురముంటిమి. బొల్లెద్దు తల్లి బొల్లావు.

ఆ పొద్దు సందకాడ ఆవులు ఇంటికి వస్తానే, మా యవ్వ - 'ఒరే! బొల్లావు ఈ రాతిరికి ఈనుతాది రోయ్!" అనింది.

ఆవు ఈనేది అంటే నాకేమీ తెలీని పిల్లాట కదా! రాతిరి అన్నం తిన్నేక సారిసారికీ బుడ్డీ దీపాన్ని పట్టుకోని పశుల కొట్టంలోకి పోయేది. బొల్లావు తోక దెగ్గరికి పోయి చూసేది. అట్ల చూసి చూసి సాలయిపాయె. కడాకి నిద్దరొచ్చి బయట మంచం మిందే పండుకోని నిద్దరపాయినా. అర్దరాతిరి

అయ్యుంటాదేమో మడి. సరింగా అప్పుడు మా యవ్వ తట్టిలేపితే ఉలిక్కిరిపడి లేస్తి -

'లెయ్యరా - నీ పాసుగులసా! మన బొల్లావు ఈనుతాంది సూడి!' అనింది సంతోసంతో.

నాకి నిద్దర గిద్దర ఎప్పుడెగిరిపాయెనో, దడగ్గన లేచి కూచోని, కండ్లు నులుముకుంటా, మంచం దిగి, అదాబదా పశుల కొట్టంలోకి దూరితి - మా యవ్వ వెనకాలే. మా జీతగాడు బుడ్డీ దీపం పట్టుకోని ఆడే కూకోని ఉండాడు.

బొల్లావు పండుకోని బుసకొడతా, దూడని బయటికి దొబ్బే దానికి తిప్పలు పడతా వుండాది.

దూడ తలా, ముందరి కాళ్ళూ అప్పుడే బయటికి వచ్చేసినాయి. ఇంగ రావాల్సింది దాని వెనకల కాళ్ళూ, తోకా. దూడ అప్పుడే మమ్మల్ని మికమిక గుడ్లు ఇడుస్తా జూస్తా వుండాది. ముంగాళ్ళు, తలా మెల్లిగా ఆడిస్తా ఉండాది. రోంత సేపటికి దాని వెనకాల కాళ్ళూ, తోకా వచ్చేసి దూడ నేల మింద పడింది. మా యవ్వ దాని దిక్కు ముచ్చటగా జూస్తా - 'ఇది తల్లి మాదిరి బొల్లిదేరోయ్!" అనింది.

'ఇది ఆడదా, మగదావ్వా!' అనడిగితి.

'తిక్క నాయాలా! అది మనిసి కాదురా, ఆడా, మగా అని అనేదానికి, ఆడదూడని పెయి దూడ అంటారు. మగదూడని కుర్రదూడ అంటారు.. ఇది కుర్రదూడరా!' అనింది - నా దిక్కు నగుతా జూసి.

అది దినాము చెంగు చెంగుమంటూ జింక పిల్ల మాదిరిగా ఎగురుతా మా గేర్లో పోతా వుంటే, దాన్ని పట్టుకోనేకి నేను ఉరికెత్తుతా వెంటపడేది. అది నా మింద దయదలిచి చిక్కేదే కానీ, మామూలుగా అయితే నాకి అందేది కాదు. సందకాడ బొల్లావు మేపు నించి తిరిగి వచ్చేదంకా దానితోనే గడిపేది నేను. బొల్లావు ఎంత మంచి ఆవంటే చంటి పిల్లలని పొదుక్కి పట్టించినా తాపుకొనేది. మా గేర్లో పాలుసాలని పిల్లల తల్లులు, బొల్లావు పాల కోసరం పొద్దన్నే మా ఇంటి పడసాలికట్టకు సత్తూ, ఇత్తడి గళాసుల్ని పట్టుకోని కూకోనే వాళ్లు. పాలనీ, మజ్జిగనీ అమ్మేది కాదు మాయవ్వ.

బొల్లిదూడ పెరిగి పెద్దదయినాక దానికి ఎత్తయిన మూపురం ఉంటుందా.. అనేది నా అనుమానం. మా ఊర్లో రెడ్డోళ్ళ ఒంగోలు గిత్తలకి ఉండే మూపురాల్ని చూసినాక, మా బొల్లిదూడకి కూడా అట్లా ఎత్తయిన మూపురముంటే బాగుంటుందని నా ఆశ. ఒకరోజు పొద్దన్నే మా యవ్వ బొల్లావు పాలు పిండుతాంటే ఆ మాటే అడిగినా.

'మూపురము ఎత్తురంగా ఉండల్లంటే దినాము పొద్దన పూట్ల గోని పట్ట మూపురం మింద వేసి, రెండు చేతులతోనూ అదిమి, పైకి ఎగబీకుతా ఉండల్లరా!' అని చెప్పె మా యవ్వ.

ఇంగ జూడీ - ఆ పొద్దటి నుంచీ దాన్ని గుంజకి కట్టేసేదీ మా యవ్వ చెప్పినట్లే చేసేదీ.. అది ఎంత ఎగిరినా, ఏం జేసినా ఇడిసేదిలా. చాన్నాళ్ళే కష్టపడినాను. అయినా గుణం కనిపించలా, నాకి జూస్తే అనంతపురంలో చదువు. మా నాయిన తిడతాడని చెప్పి వెళ్లిపోయినా. ఆ తర్వాత అది పెద్దదయి బొల్లి కుర్రయింది. మరింత పెద్దదయి బొల్లెద్దు అయింది. దాని మూపురం ఒంగోలు గిత్త మూపురం మాదిరి కాకున్నా, దాని మింద నాకు మమకారం తగ్గలా.

అట్లా బొల్లెద్దు ఇప్పుడు మాది కాదు. కొనుక్కోనిండే వాళ్ళది అయిపోయింది, అని అనుకుంటా వుంటే కడుపులో బొలే సంగటమయితా ఉండాది.

✿✿✿

సందకాడ మేతలకి పోయిండే ఆవులు ఇంటికొచ్చినాయి. అవిట్లని మా యవ్వ కట్టేస్తా - 'బంగారమట్లా బొల్లెద్దుని అమ్ముకొంటి. ఏ నాడన్నా పనికి కుంటుపెట్టి వుండెనా? ఏనాడన్నా దొంగబోయి గెడ్డి దడ్డైండ్లలో దూరిండేనా? ఎట్లా పసరము, ఎంత మంచి పసరము.. అట్లా పసరాన్ని వొరుపు అగ్గిపడిండే దాన్నించీ అమ్ముకొంటి' అంటానని ఏడుపు గొంతుతో, సనుగుతా ఉండాది. అట్ల సనుగుతూనే కొంగుతో కండ్లు తుడుసుకుంటా ఉండాది. ఆ రేతిరికి ఆయమ్మ బొల్లెద్దు మింద దిగులుతో బువ్వ ముట్టనే లేదు.

✿✿✿

అప్పటికి రెండు దినాలయింది బొల్లెద్దు మా మద్దిన లేక. మా యవ్వ బొల్లెద్దుని తలవని పూటంటూ లేదు.

రేతిరి నిద్దర పొయ్యేదానికి మేము సిద్ధమయితా వుండాము. అప్పుడే రంకె వినిపిచ్చె. అది కచ్చితంగా మా బొల్లెద్దు రంకే అనిపిచ్చెనాకి. ఆ మాటే మా యవ్వతో అంటి.

'అవునురా! నిజమే.. నాకి అట్లే అనిపిస్తా ఉండాది' అంటానని బుడ్డీదీపాన్ని ఎత్తి పట్టుకోని ఆత్రంగా చింత మాని కిందికి మాయవ్వ పోతావుంటే, నేనూ వెంటబోతి.

నిజమే!

అది నిజంగా బొల్లెద్దే!!

కర్రెద్దుతాన నిలబడి దాన్ని ప్రేమగా నాకుతాంది.

బెప్పెరపోయి ఇద్దురమూ దాన్నే జూస్తా నిలబడినాము.

ఇంక మా యవ్వ దాని దెగ్గిరికి పోయి - గొంతులో ఏడుపు పొర్లుకోని వస్తా వుంటే - 'ఓరి ఓరి బొల్లిగా! వస్తివేమిరా? ఎనభై మైళ్ళ దొవ్వ నడిచి వస్తివేమప్పా! ఎంత నెర్లురా నా మింద నీకి.. పాపిస్టిదాన్నిరా.. నేను. దుడ్లకి అవుసరమొచ్చి అమ్ముకొంటిరా!' అంటానని మాట్లాడుతానే, ఏడుస్తా దాని గంగడోలు దువ్వుతా ఉంది. అది మాయవ్వ ఇంకో ముంజేతిని ఎంతో ప్రేమగా నాకుతా ఉంది.

ఆ మరుసటి దినము బొల్లెద్దుని కొనుక్కోని పోయిన ఆసాములు రానే వచ్చిరి.

దాన్నింక కచ్చితంగా పట్టుకుపోతారని రూఢీ చేసుకొంటి. మా యవ్వ వాళ్లతో రోంతసేపు మాట్లాడినంక - 'అంత నెర్లయిన ఎద్దుని మడీ ఎట్లప్పా! మీ వెంట పంపేది. మీ దుడ్లు మీరు తీసుకోని పోండప్పా! నా కష్టాలు నూరున్నా పడతాను. ఎట్ల అయ్యేది అట్ల అయితాది' అంటనని మా యవ్వ అంటా ఉంటే నాకి బొలే సంతోషమైపోయింది.

- ఆదివారం ఆంధ్రభూమి, 25-03-2001